# పరాజితులు

శ్రీ అంగర సూర్యారావు

మానవుడు సృష్టించిన దారిద్ర్యంతో మానవుడే హోరా హోరీ పోరాడుతున్నాడు. తీవ్రపరాజయాలమధ్య నలిగి చివరకు నేలకొరిగి పోతున్నాడు. అతని సంతతి తిరిగి పోరాటాన్ని కొనసాగిస్తోంది. ఈ సంఘర్షణకు అంతమనేది వుందా ?

“నాజీవితం దుర్భరం. తినడానికి తిండిలేదు. నివసించడానికి కొంపలేదు. నామొర వినేవారెవరూ లేరు. చివరకు భగవంతుడితో మొరపెట్టుకునే అవకాశం కూడా లేదు. ఫల పుష్పాలు దక్షిణా లేనిదే భగవంతుడు కూడా నా మొర ఆలకించడు,” అన్నాడు ఒక దరిద్రుడు.

అతని మాటలు విని రెండు అస్థిపంజరాలు నవ్వినై. వాళ్లిద్దరూ మృత్యుదేవత ఆహ్వానంకోసం ఎదురుచూస్తున్న క్షయరోగులు. వెన్నెముక విరిగిన ఒకమనిషి వానపాములా పాకుతూ వచ్చి ఆ గుంపులో చేరాడు. ఏడుస్తున్న వాళ్లు, మొత్తుకుంటున్న వాళ్లు, చేతులు విరిగినవాళ్లు, కాళ్లు విరిగినవాళ్లు రోగాల వల్ల శరీరంలోని రక్తమాంసాలు హరించిపోయి బొమికలు మిగిలినవాళ్లు అందరూ అక్కడకు చేరుతున్నారు. దారిద్ర్యదేవత అక్కడ నగ్నతాండవం చేస్తోంది.

ఆకస్మికంగా కోలాహలం ఆగిపోయింది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బూట్ల చప్పుడు వినిపించింది. డాక్టర్లు వరుసగా ఎవరి గదులలోకి వారు వెళ్లారు. నర్సులు, ఆయాలు ఒక మూలనుంచి మరొక మూలకు తొందరగా తిరుగుతున్నారు.

ఆ భయంకర వాతావరణం మధ్య మృత్యుకోరల నడుమ చిక్కుకొని విల విల తన్నుకొంటున్న ఒక యువకుణ్ణి స్ట్రెచ్చర్ మీద వేసి తీసుకువెడుతున్నారు. ఆ యువకుడు తెల్లగా పాలిపోయి వున్నాడు. అతని నల్లని జుత్తు చిందర వందరగా తెల్లని ఫాలంమీద పడి మెరుస్తోంది. పెదవులు రెండూ దగ్గరకు మూతపడి అతనిలోని గంభీరతను సూచిస్తున్నై. స్ట్రెచ్చర్ ఆపరేషన్ థియేటరులోకి వెళ్లింది. ఆ వెనుక భయ విహ్వలయై వస్తున్న యువతి గదిముందు ఆగిపోయింది.

రోగిని బల్లమీద వేశారు. అతను కళ్లు తెరచి చూశాడు. ధవళ వస్త్రధారులైన యిద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సులూ తళ తళ మెరుస్తున్న కత్తులను సర్దుకున్నారు. ఆ కత్తులు మరోక్షణంలో తన సుందర శరీరాన్ని చీల్చుతాయి. అతని ముఖంలో భయపడుతున్న చిహ్నలేమీ కనిపించలేదు.

“మీకు బంధువు లెవరూ లేరూ ?” డాక్టరు ప్రశ్నించాడు. ఆ యువకుడు ఒకసారి నవ్వి “మీరు మాత్రం నాకు బంధువులు కారూ డాక్టర్ గారూ!” అన్నాడు. ఆ మాటలు నూతిలోని గొంతుకలోంచి వినిపించినట్లున్నై. డాక్టరు ముఖంలో ఆశ్చర్య చిహ్నలు కనిపించినై. బహుశా అంతటి ధైర్యం కలరోగిని చూడడం ఆ డాక్టరుకు అదే మొదటి సారేమో ! నర్సు ఆపరేషన్ థియేటరులోంచి బయటకు వచ్చింది. పైటచెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటున్న యువతిని సమీపించి “యిటువంటి సమయంలో అధైర్యపడకూడదమ్మా! ధైర్యంగా వుండు. నీభర్తను మృత్యుముఖంనుంచి తప్పించడంకోసం డాక్టర్ విశ్వప్రత్నం చేస్తున్నారు.”— ఆయువతిని బల్లమీద కూర్చోబెట్టి లోనికి వెళ్లిపోయింది నర్సు.

కొద్ది క్షణాలలో ఆనర్సు తిరిగి యేవార్త తెస్తుందో ! ఆమెకన్నీరు పొంగి ప్రవహిస్తున్న వాహినిలా పెల్లుబుకుతోంది. ఆమెకళ్లు కెంపుల్లా ఎర్రబడ్డాయి. నిండుచంద్రుణ్ణి కప్పిన మబ్బుల్లా ఆమె తెల్లని ముఖంలో విషాద చ్ఛాయలు అలుముకొన్నాయ్. ఆమెచేతికి అమృతపాత్రనుయిచ్చి

చవి చూడకమునుపే తిరిగి ఎవరో తన్నుకుపోతున్నారు. జీవితంలో మాధుర్యంతోపాటు యింతటి చేదుకూడా వుందా ?

ఇంతసేపటినుంచీ యీ దృశ్యాన్ని దూరాన్నుంచి పరిశీలిస్తున్న ఒక స్త్రీ ఈయువతిని సమీపించింది.

"విచారించకమ్మా. జీవితంలో కష్టాలను తట్టుకోగలగడమే గొప్పతనం. — నీ పేరేమిటమ్మా?" బుజ్జగిస్తూ ప్రశ్నించింది ఆస్త్రీ.

"శకుంతల!" చీరచెంగుతో కళ్లు ఒత్తుకుంటూ జవాబు చెప్పింది యువతి.

"ఆయన మీభర్తా ?"

అవునన్నట్లు తల వూపింది శకుంతల.

"మీకు పెళ్లయి ఎంతకాలం అవుతుందమ్మా?"

"ఇది మూడవ సంవత్సరం. యీస్వల్పకాలంలోనే మా ఆశాసౌధాలు కూలిపోతున్నాయ్." వెక్కి వెక్కి యేడ్చింది శకుంతల.

"ఏడవకమ్మా! నువ్వు అచ్చంగా మా చెల్లిలా వున్నావు. నిన్ను చూస్తుంటే నాకు జాలివేస్తోంది. ఇంత కష్టకాలంలో కూడా మీబంధువు లెవరూ రాలేదేం ?"

"కొన్ని విచిత్ర పరిస్థితులమధ్య విశ్వం నేనూ కలుసుకొని వివాహం చేసుకున్నాం. గతమంతా ఒక చిత్రమైన కల అనిపిస్తోంది నాకు. జరిగిపోయిన ఆనందమయ జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే మరింత విచారం కలుగుతుందేమోనని భయంగావుంది."

"నీభర్తకు యేప్రమాదం కలగదని నాహృదయంలో ఎవరో చెబుతున్నట్లువుంది. భయపడకు శకుంతలా! యీప్రమాదంనుంచి తప్పించుకొని మీరు యిద్దరూ సుఖ సౌభాగ్యాలతో జీవితాలను కొనసాగించాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. నీహృదయం తేలికపడంకోసమైనా మీవైవాహిక జీవితంగురించి నాకు చెప్పమ్మా! నాదగ్గర నీకు సంకోచమెందుకు ? నేను నీకు అక్కలాంటిదాన్ని."

ఆమెమాటలలో ఎంతటి నైర్మల్యం లాలిత్యం వున్నాయ్! శకుంతల కళ్లెత్తి ఆస్త్రీముఖంలోకి చూసింది. జీవన సంగ్రామంలో ఆరితేరిన యోధురాలులా కనిపిస్తోందామె. దుఃఖసముద్రంలో మునిగిపోతున్న తనకు చేయూతనిచ్చి కాపాడడానికి వచ్చిన దేవతలా కనిపించింది. ఏ జన్మాంతరంలోనో విడిపోయిన ఆత్మబంధువును తిరిగి కలుసుకున్నట్లనిపించింది శకుంతలకు.

"నేను చిన్నప్పటినుంచీ అల్లారు ముద్దుగా పెరిగాను. కష్టాలనేవి వున్నవని వినడమేకాని ఎప్పుడూ అనుభవించలేదు. ఊహ తెలియక పూర్వమే తల్లిదండ్రులను పోగొట్టుకున్నాను. అయినా ఆలోటు యేమాత్రం కనిపించకుండా మా అన్నయ్య నన్ను పెంచాడు. నేను నిండుయవ్వనం వైపు పురోగమిస్తున్నకొద్దీ మా అన్నయ్యముఖంలో విషాదరేఖలు అలుముకోసాగినై. ఎంత ప్రయత్నించినా పెళ్లికాలేదు. నాజీవితం ఎక్కడ పాడవుతుందో నన్న భయంతో మాఅన్నయ్య నా చదువు మానిపించలేదు. ఇరవైరెండు సంవత్సరాల వయసు వచ్చేసరికి నాచదువు పూర్తిఅయ్యింది. నా కాళ్లమీద నేను నిలబడగల శక్తి నాకు రాగానే మాఅన్నయ్యకు కొంత సంతోషం కలిగింది.—ఆరోజుల్లోనే మా అన్నయ్యకు విశ్వంతో పరిచయం కలిగింది. రోజులు గడిచేకొద్దీ ఆపరిచయం స్నేహంగా మారింది. మా యింటికి వస్తూవుండేవాడు. అతనిముఖంలో యెప్పుడూ విషాదరేఖలు కనిపిస్తూవుండేవి. జీవితంలో పెద్ద దెబ్బ తిన్న మనిషిలా కనిపించేవాడు. మేం యెంత ప్రయత్నించినా అతనిచేత అతని గత వృత్తాంతాన్ని చెప్పించలేకపోయాం. — నాగురించి మాఅన్నయ్యకు కలిగిన విచారంలో విశ్వంకూడా భాగం పంచుకున్నాడు. ఇది కొంతకాలం గడిచేసరికి కలిగిన పరిణామం. వయసు దాటిన యువతిని, అందులోనూ ఉద్యోగం చేస్తున్నదానిని పెళ్లి చేసుకోవడానికి యెవరు అంగీకరిస్తారు ? అంతటి సంస్కారవంతులు యెక్కడ దొరుకుతారు ? యిటువంటి సందేహాల మీద చర్చించుకునేవారు ఆయిద్దరు స్నేహితులు. ఒక రోజు మాఅన్నయ్య నన్ను ఆకస్మికంగా ప్రశ్నించాడు.

"చూడు శకుంతలా! నీకు విశ్వాన్ని పెళ్లి చేసుకోవడానికేమైనా అభ్యంతరం వుంటుందా ?"

హృదయంలో పుట్టి హృదయంలోనే పరిభ్రమిస్తున్న ఒకభావరేఖ పెల్లుబికి నాముఖాన్ని సిగ్గుతో నింపింది. సౌందర్యం, సహృదయం అన్నీ వున్న

యువకుణ్ణి భర్తగా వరించడానికి ఏ యువతి యిష్టపడదు ? కాని అతను అందుకు అంగీకరించవద్దా ?

“ముందు నీ అభిప్రాయం తెలుసుకోవడం అవసరం. నీకు అంగీకారమైతే ఆతరవాత విశ్వాన్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తాను.” అన్నాడు అన్నయ్య.

“విశ్వం యిందుకు అంగీకరిస్తాడని నేను అనుకోను !” అన్నాను, నాఅంగీకారాన్ని సూచనప్రాయంగా తెలియజేస్తూ !

“మనం యెంతకాలం ప్రయత్నించినా విశ్వం వంటి మంచివాణ్ణి సంపాదించలేం. కష్టాలను నీదరికి చేరనివ్వకుండా నిన్ను యింతకాలం పెంచి చివరకు తెలియనివాడి చేతులలో నిన్ను పెట్టడం నాకు యిష్టం లేదు శకుంతలా ! ఇంతవరకూ నీ జీవితాన్ని యెంత సుఖంగా గడిపావో యికముందుకూడా రెట్టింపుసుఖ సౌభాగ్యాలతో నువ్వు జీవితాన్ని గడపగలగాలనే నా కోరిక. ఈ నా కోరిక నెరవేరాలంటే నిన్ను విశ్వం చేతులలో వుంచడంకంటే నాకు గత్యంతరం కనిపించడం లేదమ్మా !”

నేను సిగ్గుతో అన్నయ్యముఖంలోకి చూడలేక పోయాను. బయట గాలికి ఉల్లాసంగా తలలూపుతున్న చెట్లను కిటికీలోంచి చూస్తూ నుంచున్నాను.

ఆసాయంత్రం యెప్పటిలా విశ్వం వచ్చాడు. అయినా ఆరోజు అతను రావడంలో నాకేదో కొత్తదనం కనిపించింది. సిగ్గుతో లోనికి వెళ్లి పోయాను. అన్నయ్య, విశ్వం గదిలో కూర్చున్నారు. నేను బయట నుంచుని కిటికీలోంచి వాళ్లకేసి చూస్తున్నాను. అది నాభవిష్యత్తును నిర్ణయించే రోజు.

“విశ్వం! శకుంతలపెళ్లికోసం ఎంతో ప్రయత్నం చేశాను. అదినీకూ తెలుసు. కాని ఆమెకు అన్నివిధాలా తగిన వరుడు నాకింతవరకూ యెక్కడా కనిపించలేదు. ఏక్షణంలోనైనా నాకు మనప్రాంతాలనుంచి బదిలీ అయ్యే అవకాశం వుంది. శకుంతలను ఒంటరిగా విడిచి వెళ్లడానికి నాకు యిష్టంలేదు. కూడా తీసుకుని వెడితే ఆపై ప్రాంతాలలో ఆమెకు యీజన్మలో పెళ్లి అవుతుందనే నమ్మకం నాకు లేదు. ఈ ఆపద నుంచి తప్పుకోవడానికి నాకేమీ ఉపాయం కనిపించడంలేదు.” అన్నాడు అన్నయ్య.

“నిజమే; ఇది చాలా చిక్కుసమస్యగానే కనిపిస్తోంది. ఆమెకు పెళ్లిచెయ్యడంకంటే మార్గాంతరం కనిపించడంలేదు.” అన్నాడు విశ్వం.

“ఆమెకు పెళ్లిచేస్తే యీచిక్కులన్నీ విడిపోతాయని నాకు తెలుసు.—విశ్వం ! నిన్నొక కోరిక కోరుతాను. అది చెల్లిస్తావా ?” ప్రాధేయపూర్వకంగా అడిగాడు అన్నయ్య.

“రాజూ ! నాదగ్గర నీకు సంకోచమెందుకు? నీకోసం యెంతశ్రమనయినా భరిస్తాను. నీతో రాత్రింబవళ్లు తిరగమన్నా తిరుగుతాను. ఆమెకు పెళ్లి అయ్యేవరకూ నీతోపాటు నేను విశ్రాంతి తీసుకోను.” అన్నాడు విశ్వం.

పాపం ! విశ్వం ఇంకా అన్నయ్య అభిప్రాయాన్ని అర్థంచేసుకోలేదు.

“నువ్వూ నేనూ శ్రమపడనక్కరలేకుండా శకుంతల జీవితం బాగుపడే ఉపాయంఒకటి చెబుతాను. అందుకు నువ్వుఅంగీకరిస్తావా ? ”

“అంతకంటే మనకు కావలిసిందేముంది రాజూ! అదేదో వేగంచెప్పు. తగిన ప్రయత్నం చేద్దాం.” అన్నాడు ఆతురతతో విశ్వం.

“శకుంతలను నువ్వుపెళ్లి చేసుకోవాలి! ”

“నేనా !!!”—సుకుమారంగా పెరిగిన చంటికుర్రాణ్ణి కొరడాతో కొడితే అతనిముఖం ఎలా వుంటుందో అలా వికృతంగా మారింది విశ్వంముఖం. అతని నుదుటిపై స్వేదబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. నాహృదయంలో ఆశాజ్యోతి— పెనుగాలిలోని దీపంలా.—రెపరెప కొట్టుకోసాగింది. అది యేక్షణంలోనైనా ఆరిపోవచ్చు.

“నీకు కూడా శకుంతలను పెళ్లిచేసుకోవడం యిష్టంలేదా విశ్వం!”

అన్నయ్య మాటలలో దిగులు కనిపిస్తోంది.

“అదికాదు రాజూ! నాకు యీ జీవితంలో అసలు పెళ్లిచేసుకోవడమే యిష్టంలేదు. దయచేసి నన్ను కారణంమాత్రం అడగకు,” బాధగా అన్నాడు విశ్వం.

“ఏ కారణంవల్ల నువ్వు పెళ్లి చేసుకోనంటున్నావో ఆ కారణాన్ని నీహృదయంలోనే దాచుకో!

నాకు చెప్పనక్కరలేదు. కాని నువ్వు శకుంతల జీవితాన్ని మాత్రం ఆనందమయం చెయ్యి. నా యీ ఒక్క కోర్కె తీర్చు! నీకు జీవితాంతం కృతజ్ఞుడనై వుంటాను!" అన్నయ్య ప్రాథేయపూర్వకంగా అడిగాడు.

"నాకు ఆలోచించుకోవడానికి కొంత సమయం కావాలి!" అన్నాడు విశ్వం. తిరిగి నా హృదయంలో ఆశారేఖ మెరిసింది. అతను వెళ్లిపోయాడు.

తరవాత వారం రోజులకు మా యిద్దరికీ వివాహం అయిపోయింది. తలచినట్లుగానే మా అన్నయ్యకు బదిలీ అయిపోయింది. నన్ను విశ్వం చేతులలో వుంచి సంతోషంతో అన్నయ్య వెళ్లిపోయాడు. ప్రశాంత వాతావరణంలో రెండేళ్లు ఆనందమయ జీవితాన్ని గడిపాం. నాకు రవంత కష్టం కలిగినా ఆయన చూడలేకపోయేవారు. విశ్వం మనసుకు కష్టం కలిగే పని నేనెప్పుడూ చేసియెరుగను. కాని మా ఆనందాన్ని విధి చూడలేకపోయాడు. నా జీవితం యేమౌతుందో ..." చేతులలో ముఖం దాచుకొని వెక్కి వెక్కి యేడ్చింది శకుంతల.

"విచారించకు శకుంతలా! మీవంటి అదృష్టవంతులు ప్రపంచంలో అరుదుగా వుంటారు. జీవితాన్ని ఆనందంగా గడిపిన మీకు కష్టాలను తట్టుకోగల శక్తి తక్కువగా వుంటుంది. సుఖమంటే యెలావుంటుందో తెలియకుండా జీవితాల్ని దొర్లిస్తున్న మనుషులు యీ ప్రపంచంలో యెందరో వున్నారు. వాళ్లు నేరం చెయ్యకుండానే శిక్ష అనుభవిస్తున్నారు. ఉదాహరణకు నీకు తిన్నగా నేనే వున్నాను. నా జీవితంలో ఆనందం అనేదాన్ని నేనెప్పుడూ చవిచూడలేదు. నా బాధామయగాథవింటే - నీకు కలిగిన యీ కష్టం —నా కష్టాలలో యెన్నోవంతో నీకు బోధపడుతుంది." అందా స్త్రీ, గడచిపోయిన గాథలను స్మృతిపథంలోకి తెచ్చుకుంటూ!

ఇంతలో ఆకస్మికంగా తలుపు తెరువబడింది. ఇద్దరూ ఆత్రంగా నర్సుముఖంలోకి చూశారు.

"ఆపరేషన్ జయప్రదంగా ముగిసింది. ఇంకా స్వస్థత రావడానికి రెండురోజులు పడుతుంది. నీభర్తకు ఇక ప్రమాదం వుండదని మేం ఆశిస్తున్నాం." అంది నర్సు శకుంతలతో.

"ఒకసారి నన్ను చూడనివ్వరూ?" ఆశగా అడిగింది శకుంతల.

"ఇటువంటప్పుడు చూడ్డం మంచిదికాదు. రేపటికి అతను కొంచెం కోలుకుంటాడు. అప్పుడు చూడడం మంచిది. ఇక మరేం ఫర్వాలేదు. నిశ్చింతగా యింటికి వెళ్లి రేపు రా!"

నర్సు లోనికి వెళ్లిపోయింది.

"నేను యింటికి వెళ్లి యేం చెయ్యను? యీ స్థితిలో ఒంటరిగా ఆయన్ని వదిలిపెట్టి యెలా వెళ్లగలను?" ఆమె లోచనాలు తిరిగి అశ్రుపూరితాలైనాయి.

శకుంతల దైన్యస్థితికి ఆ స్త్రీహృదయంకూడా కలత చెందింది. ఆమె కళ్లలో నీరు తిరిగింది. ఒకరి కష్టాలకు మరొకరు కన్నీరు విడువగల నిర్మల హృదయాలు స్త్రీలకే వున్నవేమో!

"ప్రేమ అలా అనిపిస్తుందమ్మా! నీభర్తకు ఇక్కడేమీ భరవాలేదు. విచారాన్ని దిగమింగి యింటికి పోయి—ధైర్యంగా తిరగగలశక్తి వుండేందుకైనా—కొంచెం భోజనంచేసి విశ్రాంతి తీసుకో! నిన్ను చూస్తుంటే నువ్వే జబ్బుపడిన మనిషిలా కనిపిస్తున్నావు. ఎన్నిరోజులనుంచీ భోజనం మానేశావో!" అందా స్త్రీ.

శకుంతలకు క్షణక్షణానికి ఆ స్త్రీమీద గౌరవం యెక్కువౌతోంది. నిజంగా ఆమె తనతో వున్నందువల్లనే యీ పరిస్థితిలో తను యింత ధైర్యంగా కూర్చోగలిగింది. ఇంతవరకూ తన హృదయ క్షోభవల్ల ఆమె యెవరో తెలుసుకోనేలేదు.

"ఈ కష్టకాలంలో నాలో ధైర్యాన్ని కలిగించిన మీ రెవరో నేనింతవరకూ తెలుసుకోనైనా లేదు. మీరు దేవదూతలా సరియైన సమయానికి వచ్చి నాకు సహాయం చేశారు." అంది శకుంతల కృతజ్ఞతతో ఆమెవైపు చూస్తూ.

"జీవితంలో కష్టాలను అనుభవించినవాళ్ళు మరొకరు కష్టపడుతూవుంటే చూస్తూ వూరుకోలేరమ్మా! జ్వరంతో హాస్పిటలులో వున్న మా తమ్ముణ్ణి చూసి వస్తూంటే యీ దృశ్యం నాకంట పడింది. మిమ్మల్ని చూచినవెంటనే మీ కెవరూ

సహాయం లేరని తెలుసుకున్నాను. ఇక యింటికి వెళ్లలేకపోయాను.—చాలా ప్రొద్దెక్కింది. ఇక యింటికి వెళ్లి భోజనం చేసి విశ్రాంతి తీసుకో అమ్మా! నేను హాస్పిటలుకు యెప్పుడు వచ్చినా మిమ్మల్ని చూడకుండా వెళ్లను. నువ్వేం అధైర్యపడకమ్మా! రేపు కలుసుకుందాం"—ఆమె వెళ్లిపోయింది.

శకుంతల ఆ స్త్రీకి తన మనసులో నమస్కరించింది. బరువెక్కిన హృదయంతో యింటికి వెళ్ళిపోయింది.

లోకంలో యెందరో కరుణామయ హృదయులు వున్నారు. వారు పరులకష్టాలను తమ కష్టాలుగా భావించుకొని తమకు చేతనైన సహాయం చేస్తూ వుంటారు. కనీసం ఆ ఒక్క ఆశకూడా లేనట్లయితే దిక్కులేని వాళ్లగతి యేంకావాలి? ఆ మర్నాడు శకుంతల ఆలోచిస్తూ హాలులో బల్లమీద కూర్చుంది. సూర్యుని ఉదయ కిరణాలు హాలులో యేటవాలుగా పడుతున్నాయ్. కొందరు రోగులు చలిని భరించలేక ఆ యెండలో కూర్చున్నారు. డాక్టర్లు యింకారాలేదు. క్షణక్షణానికీ శకుంతల హృదయంలో ఆరాటం యెక్కువౌతోంది. విశ్వం యెలావున్నాడు? యిప్పటికైనా కొంచెం కోలుకునివుంటాడా? చంటిపిల్లవాడిలా అమాయకపు చూపులతో యెప్పటిలా తన వైపు చూడగలుగుతాడా? అంత సుకుమారమైన శరీరాన్ని డాక్టర్లు కత్తులతో కోస్తూవుంటే యెలా ఓర్చుకోగలిగాడో! తమకు యిదేదో అగ్నిపరీక్షలా వుంది. లేకపోతే యే దిక్కూ లేని తమకే యిలాంటి ఆపద రావాలా? యింతకూ విశ్వం కోలుకునేసరికి యెంతకాలం పడుతుంది? అసలు అతను యెప్పటి మనిషి అవగలుగుతాడా?—ఈ ఆలోచన వచ్చేసరికి ఆమె కన్నీటిని ఆపుకోలేకపోయింది.

"శకుంతలా! నీకు రోజురోజుకూ మతిపోతున్నట్లు కనిపిస్తోందమ్మా! యింకా ఒకమూల తెల్లవారిందో లేదో అప్పుడే వచ్చి యేడుస్తూ కూర్చున్నావ్? ఏడ్చి యేమైనా సాధించగలవా? కష్టాలను ధైర్యంతో యెదుర్కొగలగాలి. అంతేకాని నువ్వే ధైర్యాన్ని కోలుపోతే నిన్ను చూచి నీ భర్త యెంత అధైర్యపడతాడు? దానివల్ల యెంత నష్టంవుందో వూహించావా?"

చీరచెంగుతో కన్నీరు తుడుచుకొని ఆ స్త్రీ వైపు దీనంగా చూచింది.

"నా కష్టాలకు జాలిపడి యెవరో మిమ్మల్ని నాకు ధైర్యం కలిగించడానికి పంపారేమో ననిపిస్తోంది. మీది యీ వూరేనా? మీ భర్త యేం చేస్తారు?" ప్రశ్నించింది శకుంతల.

"రాతిహృదయాలనైనా కరిగింపజేసే నా విషాద గాథ చెప్పనా? అంగువల్ల నీ హృదయం మరింత కలవరపడుతుందేమో! అయినా నీలాంటి దుర్బల హృదయులకు స్థైర్యం కలిగించాలంటే నా జీవితగాథలాంటి భయంకరమైన గాథలు చెప్పవలసిందే. ఏ పాపం చెయ్యని కొందరు అమాయకులు యెంతటి ఘోరమైన కష్టాలను అనుభవిస్తూ వుంటారో నీకు అర్థమౌతుంది.

మా తాత — అతడెలా వుంటాడో నాకు తెలీదు—దరిద్రుడట. అతని కొడుకు—మా నాన్నకు—ఆ వారసత్వం వచ్చింది. మా నాన్నకు నేను యేకైక పుత్రికను. మా నాన్న కళాకారుడవడంవల్ల, నిత్యం ఊహాజగత్తులో విహరిస్తూ, గాలిలో మేడలు కట్టుకుంటూ జీవితాన్ని దొర్లించసాగేడు. దరిద్రాన్ని లెక్కచేసే వాడుకాదు. నాన్న రాసిన బొమ్మలు సాధారణంగా యెవరూ కొనేవారు కారు. ఒకవేళ యెవరైనా కొన్నా తగిన ధర యిచ్చేవారు కాదు. ఒకోరోజు భోజనం లేకపోయినా నాన్న ముఖంలో దిగులు రవంతైనా కనిపించేది కాదు. "మరేం ఫర్వాలేదు నీరజా! మనకు ఉజ్జ్వలమైన భవిష్యత్తు వుంది. మనంకూడా సుఖపడే రోజులు త్వరలో వస్తాయి. కష్టాలను అనుభవించినవాళ్లకే సుఖంలోని విలువ తెలుస్తుందమ్మా!" అనేవాడు నాన్న నాతో.

అవిఘ్నంగా నాన్న "రేపు" వైపు ఆశతో చూస్తూ ప్రతిరోజూ గడిపేవాడు. అలాంటి "రేపు" లెన్నో గతంలో కలిసిపోయాయి. మేం కొన్ని సంవత్సరాల క్రితం యెక్కడ వున్నామో అక్కడే వున్నాం. ఒక అడుగుకూడా ముందుకు వెయ్యలేదు. మా స్థితిలో యెట్టి మార్పూకలగలేదు. నేను నిండుయవ్వని నయ్యాను. దరిద్రుల పిల్లను దరిద్రుడే వివాహం చేసుకోవాలి. ఒక నిరుపేద కుటుంబంలోని అందమైన యువకుణ్ణి యేరి

మానాన్న నాకు వివాహంచేసి నిశ్చింతగా కన్ను మూశాడు.

నావిషాదజీవితచరిత్రలోని రెండవఘట్టం తిరిగి ప్రారంభమయింది. మా మామగారు ఒకానొక ప్పుడు ధనవంతులట. కాలపరిభ్రమణంలో దరిద్రులుగా మారారు. నలుగురు కూతుళ్లకు వైభవంగా పెళ్లి చెయ్యడంతో వారిసంపద నష్టేటిలో కలిసింది. నేను అత్తవారింటిలో అడుగు పెట్టేసరికి ఆయింటి పరిస్థితులు కల్లోలంగా వున్నాయ్. ఏ పనీ చెయ్యలేని ముసలిమామగారు, గతకాలపు మంచి రోజుల్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ ఒకమూల కూర్చుని వుండేవారు. ఆయన పెద్దకొడుకు ఉద్యోగంకోసం రోజూ శ్రమపడి తిరుగుతూవుండేవారు. పెద్దకోడలు తన నలుగురుపిల్లలను సముదాయించలేక నిత్యం యేడుస్తూవుండేది. చిన్నకొడుకుమాత్రం ఒక ఫ్యాక్టరీలో గుమాస్తాగా పనిచేస్తూ నెలకు అరవై రూపాయలు తెచ్చుకునేవారు. దారిద్ర్యాన్ని అనుభవించడం ఉగ్గుపాలతో నేర్చుకొన్నాను గనుక నేను—ఆయింటి చిన్న కోడల్ని—ధైర్యంతో మసలగలిగేదాన్ని. నాభర్త సంపాదించే అరవై రూపాయలతో యింత పెద్దకుటుంబం జీవించాలంటే యెన్ని కష్టాలను అనుభవించాలో ఆలోచించు. ఎంతటి నికృష్టజీవితాన్ని సాగించాలో ఆలోచించు. మా తోడికోడలికీ నాకూ తాతలనాటి చింకిచీరలు మినహా కట్టుకోవడానికి బట్టలు వుండేవికావు. మేం వీధిముఖం చూడడానికి సిగ్గుపడి యెప్పుడూ యింట్లోనే కూర్చునేవాళ్లం. మా బావగారి పిల్లలు చూచినవన్నీ కొనమని యేడ్చేవారు. వాళ్లకు భోజనమైనా పెట్టలేని తండ్రి ఆటవస్తువులు, బట్టలు యెలా కొనగలరు? ఆయన యెప్పుడూ దిగులుతో ఒకమూల కూర్చుని వుండేవారు. ఆ సమయంలో అప్పులవాళ్లు మా యిల్లు వేలం వేశారు. ఉన్నకొంప ఖాళీచేసి నిరుపేదలు నివసించే ఒక పేటలో చిన్న యిల్లు అద్దెకు తీసుకొన్నాం. ఇటువంటి పరిస్థితులమధ్య మా దాంపత్యజీవితం యేవిధంగా గడిచి వుంటుందో ఊహించు శకుంతలా! యీదుర్భర వాతావరణంలో ప్రణయం, సౌఖ్యం, ప్రేమ అన్న పదాలకు నిలవడానికి తావైనా వుంటదేమో ఆలోచించు శకుంతలా! — నాభర్త నన్ను చూసి సిగ్గుపడుతూ వుండేవారు. నన్ను యెప్పుడూ తప్పించుకు తిరగడానికి ప్రయత్నిస్తూ వుండేవారు. నూతన వధువునైన నాకు ముద్దు ముచ్చటలేవీ తీర్చలేక పోతున్నందుకు ఆయన తనలోతాను బాధపడుతున్నారని తెలుసుకున్నాను. ఆయన మనస్తాపం పోగొట్టడమే నా కర్తవ్యంగా భావించుకున్నాను. ఒకనాడు నన్ను ఆయన తప్పించుకొని వెళ్లిపోతున్న సమయంలో ఆయన చెయ్యి పట్టుకున్నాను. ఆయన దిగులుగా నా ముఖంలోకి చూశారు. చంద్రకిరణాలు జామిచెట్టు ఆకుల్ని దూసుకొని మామీద పడుతున్నై. ఇంటిల్లో అందరూ అర్ధాకలితో నిద్రాదేవి కౌగిలిలో ఒరిగి పోయారు.

"మీరు యింత ప్రొద్దు పోయేవరకూ యేంచేస్తున్నారు? యీ మధ్య యింత ఆలస్యంగా వస్తున్నారేం?" అన్నాను.

"వేగంగా యిల్లుచేరుకున్నందువల్ల ఫలితమేముంది నీరజా! పిల్లలయేడుపు, అన్నయ్య విషాదవదనం, నాన్న బాధతో తనలోతాను చెప్పుకునే స్వగతం—యివన్నీ యెలా భరించగలను? అందుకు వూరు మాటుమణగేవరకూ సముద్రపు ఒడ్డున కూర్చుని వస్తున్నాను."

"మీరు యింటికి రావడం ఆలస్యమయ్యేకొద్దీ నాహృదయంలో ఆరాటం యెక్కువౌతోంది. మీరు నాయందు దయవుంచి వేగం యింటికి వస్తే నాకు అదే చాలు. నాకు అన్ని సౌభాగ్యాలు లభించినట్లు సంతోషించగలను. మీరు యీమధ్య మరీ చిక్కిపోతున్నారు. కళ్లు లోతుకుపోయాయి. మీరు బెంగపెట్టుకున్నట్లు కనిపిస్తున్నారు."

"ఇంతటి చిన్నతనంలోనే నీకు కష్టాలను తట్టుకోవడం యెలా అలవాటయింది నీరజా!" అన్నారు నా ముంగురులు సవరిస్తూ. వారిముఖంలోకి ప్రేమతో చూశాను. ఎర్రటిపెదవులుకంపిస్తున్నై. ఏదో విచారాన్ని దిగమ్రింగుతున్నారని భావించాను.

మరికొన్ని నెలలు బరువుగా జీవితాలను దొర్లించాం. ఇంతలో మరోఘోరవిపత్తు మామీదపడింది. ఒకనాటిఉదయం మేం లేచి చూసేసరికి మాబావగారి మృతదేహం నేలమీద పడివుంది. భార్యాబిడ్డలు పడుతున్న కష్టాలను చూడలేక—అప్పులబాధ భరించలేక—ఎంతకాలం జీవించినా జీవితంలో మార్పు వస్తుం

దనే ఆశలేక—తనజీవిత భారాన్ని మాకుటుంబంమీాది నుంచి శాశ్వతంగా తీసివెయ్యడంకోసం తాను విషం తాగి ఆత్మహత్య చేసుకున్నానని ఒకఉత్తరంరాసి తలక్రింద పెట్టుకున్నారు. పసిపిల్లలు తండ్రిమృతదేహం మీాద పడి హృదయవిదారకంగా యేడ్చారు. తన చేతులలో గారాబంగా పెరిగిన తన పెద్దకొడుకు — తను జీవించివుండగానే తనకళ్లముందు—ప్రాణాలను గోల్పోయినందుకు ఆముసలితండ్రి శవంమీాద పడి కుమిలి కుమిలి యేడ్చాడు. మాతోడి కోడలు భర్తమృత దేహాన్ని చూసీచూడడంలోనే స్పృహతప్పి పడి పోయింది. అగ్నిజ్వాలలమధ్య నుంచున్న పసి కుర్రాడిలా నాభర్త వెర్రిచూపులుచూస్తూ వుండి పోయారు. అప్పుడు నాలో నేను అనుకున్నాను.

ఓభగవంతుడా ! నువ్వునిజంగా వున్నావా ? ఉంటే — నీపేరువెనుక దాగుకొని దరిద్రులనే ఒక తరగతిని సృష్టించిన స్వార్థపరులకేస్నిచూస్తూ వూరు కుంటావెందుకు ? నీమీాద ప్రజలకు నమ్మకం వున్నంత కాలం దరిద్రం యీలోకంనుండి నిర్మూలింపబడదా ?

ఆనాటి సంఘటనతో మాయింటిలోని రవంత వెలుగు మాయమయింది. ఆశాజ్యోతులు ఆరి పోయాయి. గాఢాంధకారం వ్యాపించింది. ఇప్పుడు కాకపోతే మరోనాటికైనా తనఅన్నకుటుంబాన్ని నిర్వహించగలడనే ఆశ నాభర్తకు వుండేది. ఆ ఆశ ఆనాటితో అడుగంటిపోయింది. కుటుంబభారమంతా నాభర్త భరించవలసివచ్చింది. నలుగురుపిల్లలూ చిన్నాన్నయిల్లు చేరుకోగానే కౌగలించుకొని జేబులు వెతికేవారు. ఆజేబులలో అప్పుడప్పుడు చిల్లరడబ్బులు, చిరుతిళ్లు వాళ్ళకు దొరుకుతూవుండేవి. చింకిచొక్కాలు తొడుక్కొని దైన్యం మూర్తీభవించినట్లున్న తండ్రిలేని పిల్లల్ని చూసి వారు కన్నీరు పెట్టుకునేవారు. నాభర్త లాంటి మంచివారికి యిటువంటి కష్టాలు కలుగు తున్నందుకు నేనెంతో బాధపడేదాన్ని. ఆయనది జాలిగుండె. ప్రతిచిన్న సంఘటనకు అది యిట్టే కరిగి పోయేది. కాని వారికష్టాలు అంతటితో ఆగిపోలేదు. తగిలినగాయానికే తిరిగి దెబ్బ తగిలినట్లు ఆపదలో మునిగివున్న నాభర్తకు కష్టపరంపరలు యెదురు రాసాగినై.

వారిముసలితండ్రి జబ్బుతో మంచంపట్టాడు. యిద్దరుచంటిపిల్లలకు ఒకేసారి విషజ్వరం వచ్చింది. వాళ్లను బ్రతికించుకోవాలంటే డాక్టర్లకు ఫీజు చెల్లించి వైద్యంచేయించాలి. ఒకపూటకు తిండివుంటే మరో పూటకు తిండిలేని దుర్భరస్థితిలో—మందులకు, డాక్ట ర్లకు డబ్బుయెక్కడినుంచి వస్తుంది? తనను కని పెంచిన తండ్రికి చివరికాలంలో తను యేవిధమైన సౌకర్యం కలిగించలేకపోయినందుకు నాభర్త యెంతో బాధపడే వారు. తండ్రిని కోల్పోయి తమ ఆశలన్నిటినీ తనమీాదే కేంద్రీకరించుకొన్న పసిపిల్లలను రోగాలకు బలిచేస్తు న్నందుకు కుమిలికుమిలి చింతించేవారు. నేను యెంత ప్రయత్నంచేసినా వారిలో ధైర్యాన్ని కలిగించలేక పోయేదాన్ని.

ఒకనాటి అర్ధరాత్రి భయంకరమైన దుస్స్వప్నం లోంచి వులికిపడిలేచి కళ్లు తెరచిచూశాను. రోగంతో బాధపడుతున్న మామగారు పక్కమంచంలోపడి మూలుగుతున్నారు. జ్వరంలో వళ్లు తెలియకుండా వున్న చంటిపిల్లలు యేస్వప్నభూమిలోనో విహరిస్తూ కలవరిస్తున్నారు. పాపం ! వాళ్లాస్వప్నజగత్తులోనైనా ఆనందాన్ని అనుభవిస్తున్నారేమో ! మరోదృశ్యం నాకంటికి కనిపించేసరికి కొరడాదెబ్బతగిలినట్లు 'కెవ్వు' మన్నాను. లోకం నిశ్శబ్దాన్ని వరించిన ఆ నడిరేయి నాభర్త దీపంముందు కూర్చుని యేదో రాస్తు న్నారు. కళ్లనుండి అశ్రువులు సంతతధారాపాతంగా నేల రాలుతున్నై. తన అన్నగారిదారినే నాభర్త కూడా అనుసరించబోతున్నట్టు తెలుసుకున్నాను. ఈవూహ నాలో కలగగానే ఆకస్మికంగా లేచి వారు రాస్తున్న ఉత్తరాన్ని లాక్కొని ముక్కలు ముక్క లుగా చించి పారేశాను. నాభర్త చంటికుర్రాడిలా నాఒడిలో తలదాచుకొని వెక్కివెక్కి యేడ్చారు. "మీారు యెప్పుడూ ఆత్మహత్య చేసుకోనని నాకు మాట యివ్వండి. లేదా నేను మీాకళ్లముందే విషంతాగి చచ్చిపోతాను." అన్నాను.

"నీరజా ! ఎంతకాలం బ్రతికినా యీజీవితం యింతే. మంచిరోజులు వస్తాయనే ఆశ యేనాడో అంతరించిపోయింది. నేను యెంతకాలం జీవించినా యీనరకయాతన అనుభవించడంకోసమే జీవించాలి. ఈబాధలనుంచి తప్పుకోవడానికి మృత్యువును ఆహ్వా నించడంకంటే మార్గాంతరం లేదు నీరజా !"

"మీారు ఆత్మహత్యచేసుకుంటే — మిమ్మల్ని చూచుకొని మీామీాద ఆశతో ప్రాణాలను నిలుపుకొం

టున్న—యీ నిర్భాగ్యజీవులమాటయేమిటి? పసిపిల్లలతో సహా మాకందరికీ విషం పెట్టి మీరుకూడా ఆత్మహత్య చేసుకోండి. అప్పుడు అందరికీ నరకయాతన తప్పుతుంది".

"అబ్బ! ఆవూహనుకూడా నేను భరించలేను నీరజా !"

మనసు కలతపడివున్న ఆసమయంలో వారిని యిక యేమీఅనడం మంచిదికాదని వూరుకున్నాను. వారు నిద్రపోయేవరకూ వారిప్రక్కనే కూర్చున్నాను. తెల్లటి చెక్కిళ్లమీద కన్నీటి చారలు మెరుస్తున్నాయ్.

ఎంతజాగ్రత్తగాచూచినా ఏదోసమయంలో నా భర్త ఆత్మహత్యచేసుకు తీరతారు. వారి ఆశాసౌధాలు కూలిపోయాయి. ఇకవారు బ్రతుకరు. వారితర్వాత ముక్కుపచ్చలారని పిల్లలతో సహా అందరూ మలమల మాడి మృత్యువుకు బలిఅవుతారు. ఈఘోరాలను నేను కళ్లారాచూస్తూ వుండగలనా ? నాకుపాపం కలిగినా సరే ! నేను మహానరకంలోపడినా సరే అనుభవిస్తాను. యిక నేనీ బాధలను భరించలేను.—తక్షణం ఒక నిశ్చయానికి వచ్చాను. తెల్లవారకమునుపే ఆయిల్లు విడిచిపెట్టి విశాలవిశ్వంలో అడుగు పెట్టాను. ఆతరవాత యేంజరిగిందో — మాకుటుంబం ఏమయ్యిందో నాకింతవరకూ తెలీదు."

తనకథ ముగించి నిట్టూర్పువిడిచింది నీరజ.

"నాగుండె భయంతోయింకా కొట్టుకుంటోంది. యిలాంటి కష్టాలు యెలాఅనుభవించగలిగారమ్మా ?" జాలిగా ప్రశ్నించింది శకుంతల.

"ఇటువంటి కష్టాలను అనుభవించినది మాఒక్క కుటుంబమే కాదమ్మా ! ఇంతటి నికృష్టజీవితాలను యెందరో గడిపి గతించారు. ఈనాటికీ యెందరో అనుభవిస్తున్నారు. దారిద్ర్యంతో మానవులు సాగించే యీపోరాటానికి యిక అంతమెప్పుడో తెలీదు" నీరజ నిస్పృహతో అంది.

ఎదుటిగదితలుపులు తెరువబడ్డాయి. నర్సు ముఖంలో గాంభీర్యం కనిపిస్తోంది. శకుంతల ఆతురతతో నర్సునడిగింది.

"ఎలావుందమ్మా వారికి?"

"ఇప్పుడే అతనికి స్పృహవచ్చింది. అదిమంచి లక్షణం కాదంటున్నారు డాక్టర్! జరగేది జరగక మానదు. ధైర్యాన్ని విడవకుండా ఒకసారి నీ భర్తను చూసిరా !" అంది జాలిగానర్సు.

నర్సువైఖరి చూసేసరికి ఆయిద్దరు స్త్రీలకు భయంకలిగింది. హృదయాలను కదిలించేవిచారాన్ని దిగమ్రింగుకుంటూ నర్సువెనుక గదిలోకి యిద్దరూ వెళ్లారు. రోగితనలోతాను నవ్వుకుంటున్నాడు. మధ్య మధ్య ఏమిటో మాట్లాడుతున్నాడు.

"అమ్మాయీ! నువ్వేదో ఆశలతో పుట్టావు. తీరని కోరికలకోసం యెదురు చూస్తూ జీవితంగడిపావు. ఉన్నతపథంకోసం చేతులు చాచి చాచి అథఃపాతాళంలోకిపోయావు. జీవితంలో ఘోరపరాజయం పొందావు. నీజీ........."

"ఏమిటి మాట్లాడుతున్నారు ? ఇలా నాముఖంలోకి చూడండి!" భర్తచుబుకాన్ని పట్టుకొని కన్నీటితో ప్రశ్నించింది శకుంతల.

శకుంతలకేసి రోగి తలతిప్పాడు. శకుంతల వెనుక అశ్రుపూరిత లోచనాలతో నిలచివున్న నీరజను రోగిచూశాడు. అతను కెవ్వుమని యేడ్చిచంటి కుర్రాడిలా "నీరజా!" అని రోదనస్వరంతో అరిచాడు.

"మీ కష్టాలు యిప్పటికికూడా అంతం కాలేదా?" గద్గదకంఠంతో రోగిముఖాన్ని నిమురుతూ ప్రశ్నించింది నీరజ. విశ్వం పెదవులమీద బాధారేఖ విరిసింది. కళ్లు తిరగబడ్డాయి. అతనిలోని జీవనజ్యోతి ఆరిపోయింది. నీరజ వళ్లు తెలియని విచారంలో మృతదేహాన్ని కౌగలించుకొని కన్నీరు మున్నీరుగా యేడువసాగింది. శకుంతల వెర్రిచూపులతో నీరజకేసి, భర్తశవంకేసి చూస్తూ కూలబడిపోయింది.